కథ

ఆర్.శ్రీదేవి

# అమ్మంటే అమ్మే!

భయపడుతూనే గదిలో అడుగుపెట్టాను. గుప్పుమంటూ మల్లెపూల వాసన గుండెలలో దాగిన అనుభూతులను బయటకు లాగింది. లోపలకు చూశాను. మంచంపైన పట్టాభిషేకానికి సిద్ధమవుతున్న యువరాజులా కూర్చున్నాడు పృథ్వి.

మంచం చుట్టూ మల్లెమాలలు ఊగుతున్నాయి ఉత్సాహంగా. టేబుల్‌పై ఉన్న అగరొత్తులు పృథ్వి ఉచ్ఛ్వాస నిశ్వాసల్లా వేడి పొగలు కక్కుతున్నాయి. నా మనస్సంతా గందరగోళంగా ఉంది. ఏవేవో భయాలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

పృథ్వి లేచి నా దగ్గరకు వచ్చాడు.

తలదించుకున్నాను.

వేలితో గడ్డం కింద చెయ్యి పెట్టి తలపైకి ఎత్తాడు.

నేను భయంతో రెండడుగులు వెనక్కు వేశాను.

"ఏంటి నందూ! నాపై కోపమా? భయమా? ఇటు చూడు నువ్వంటే నాకెంత ఇష్టమో తెలుసా? నిన్ను చూడగానే ప్రేమించాను. అందుకే పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నాను" తమకంగా చెప్పాడు పృథ్వి.

"పెళ్లి చేసుకుని నా జీవితం నాశనం చేశారు. డిగ్రీ అవ్వగానే సివిల్స్ రాసి కలెక్టర్ అవ్వాలనుకున్నాను. మధ్యలో మీరు వచ్చి...."

ఏడుపు తన్నుకు రావడంతో మాటలు మధ్యలో మింగేశాను.

"అంటే ఈ పెళ్లి నీకు ఇష్టం లేదా?"

"లేదు..." ఏమాత్రం ఆలోచించకుండా చెప్పేశాను.

పృథ్వి ముఖం ఎర్రబారింది. ఆయన ముఖం చూశాక నేను చేసిన తప్పు తెలిసివచ్చింది. చరిత్రలో ఏ భార్య భర్తతో శోభనం రోజు రాత్రి ఈ పెళ్లి నాకు ఇష్టం లేదు అని చెప్పి ఉండదు.

"వెళ్లి మీ నాన్నను అడుగుతాను. పెళ్లంటే ఇష్టంలేని నిన్ను నాకిచ్చి ఎందుకు పెళ్లి చేశాడో ఆ పెద్ద మనిషినే అడిగి తేల్చుకుంటాను..." కోపంగా అని గదిలో నుండి బయటకు వెళ్లబోయాడు పృథ్వి.

పరుగున వెళ్లి అతనికి అడ్డంగా నిలబడ్డాను.

"మీరంటే ఇష్టమే. నాకు మీరంటే ఇష్టమే" వణుకుతూ గబగబా చెప్పాను.

పెళ్లికి వచ్చిన చుట్టాలందరూ ఇంట్లోనే ఉన్నారు. ఇప్పుడు గొడవ అయితే పరువుపోతుంది. రెండు చేతులు జోడించి అతనికి నమస్కరించాను. అప్పటికీ నా కళ్లలో నీళ్లు ఉన్నాయి.

పృథ్వికి నా పరిస్థితి అర్థమైనట్లుంది. నా భుజాలపై చేతులు వేసి మంచం వరకు నడిపించాడు. మంచంపై కూర్చోబెట్టి అనునయంగా అడిగాడు.

"అసలు నీ అభ్యంతరం ఏమిటి?"

ఒక్క క్షణం మౌనంగా ఉండిపోయాను. చెప్పాలో, చెప్పకూడదో తెలియడం లేదు. కొన్ని క్షణాలు ఆలోచించిన తర్వాత చెప్పడమే మంచిదనిపించింది. "నాకు చదువుకోవాలని ఉంది. పెద్ద పొజిషన్‌లోకి వెళ్లాలని ఉంది..."

"పెళ్లయ్యాక చదవకూడదా? నేను నిన్ను చదివిస్తాను. నీ ఇష్టం వచ్చినంత కాలం చదువుకో" చెప్పాడు పృథ్వి.

"పెళ్లయ్యాక ఇంకా చదువేంటి? పిల్లల్ని కనడం, వాళ్ల ఆలనా పాలనా చూడడం వీటితోనే జీవితం గడిచిపోతుంది."

కాస్సేపు మా ఇద్దరి మధ్య నిశ్శబ్దం తాండవం చేసింది. నిశ్శబ్దం అంత భయంకరంగా ఉంటుందని నాకు మొదటిసారి తెలిసింది. తన మనస్సులో ఏం అనుకుంటున్నాడో నాకు అర్థం కావడం లేదు. చివరకు తనే పరిష్కారం చెప్పాడు.

"నీ చదువు పూర్తయ్యేవరకు పిల్లలను కనడం వాయిదా వేద్దాం. అందుకు కావల్సిన జాగ్రత్తలు తీసుకుందాం"

అది నాకు ఆమోదయోగ్యంగానే అనిపించింది.

"సరే" అన్నాను.

"సంధి అయిపోయిందిగా ఇక యుద్ధం మొదలుపెడదామా?" చిలిపిగా అడిగాడు పృథ్వి.

* * *

మా అత్తగారిల్లు నిజంగా స్వర్గసీమే.

మావయ్య పంచాయితీ ఆఫీసర్. రిటైర్మెంట్‌కు దగ్గరగా వచ్చేశారు. అత్తయ్య అచ్చమైన పదహారణాల గృహిణి. వంటిల్లు ఆమె సామ్రాజ్యం. అందులోనికి అడుగుపెట్టడానికి నాకు కూడా అధికారం లేదు. సో హాపీగా నా చదువు నేను చదువుకుంటూ మెట్టు మీద మెట్టు ఎక్కసాగాను. శ్రీవారు రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఎప్పుడూ ఆ పనులతో బిజీగా ఉంటారు. కానీ నేనంటే వల్లమాలిన ఇష్టం. మా పుట్టింట్లో అందరూ మమ్మల్ని చూడముచ్చటైన జంట అంటారు. అత్తింటి బంధువుల్లో చాలామంది మొగుడిని కొంగుకు కట్టేసుకుంది అంటారనుకోండి. అది వేరే విషయం.

పృథ్వికి నా మాటంటే చాలా గౌరవం. శోభనం రోజు నాకిచ్చిన మాట ఐదేళ్లయినా ఇంకా నిలబెట్టుకుంటూనే ఉన్నాడు. ఈ ఐదేళ్లలో నేను డిగ్రీ, పి.జి. పూర్తిచేశాను. సివిల్స్‌లో సెలక్ట్ అయ్యాను. రేపోమాపో వచ్చే పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నాను.

అప్పుడు మొదలయ్యింది ఇంట్లో ఒక కొత్త సమస్య. మా అత్తగారు పిల్లలు కావాలని ఒకటే రొద. పిల్లలు పుట్టకుండా ఏమైనా వాడుతుంటే మానేయమని నా చెవిలో ఇల్లు కట్టుకుని పోరు పెట్టింది. చివరకు డాక్టర్ దగ్గరకు వెళ్దామని బలవంతం పెట్టింది. పృథ్వి నా వైపే నిలబడ్డాడు. దాంతో ఆమె సణుక్కుంటూ ఉండిపోయింది. ఈ విషయంలో మా మావయ్యగారిలో కూడా చిన్న అసంతృప్తి ఉందని నా అనుమానం. కానీ నేను ఎవ్వరినీ లెక్క చేయదల్చుకోలేదు. పెద్ద ఆఫీసర్‌ని కావాలి. జీవితంలో ఎన్నో అత్యున్నత శిఖరాలు ఎక్కాలి. దానికి ఇటువంటి చిన్న చిన్న అడ్డంకుల్ని లెక్క చేయకూడదు.

* * *

ఆ రోజు ఉదయం నుండి వర్షంగా ఉంది. ఆకాశం నుండి ఎవరో కుండలతో కుమ్మరిస్తున్నట్లు ఒక్కటే వాన. ఆ వర్షంలో వెళ్లొద్దన్నా వినకుండా బయటకు వెళ్లాడు పృథ్వి. సమయానికి అత్తయ్య కూడా ఇంట్లో లేరు. ఆవిడ బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ పిల్లాడిని ఉయ్యాల తొట్లో వేసే కార్యక్రమం ఉంది. అక్కడి నుండి వచ్చాక ఖచ్చితంగా నాకు సుదీర్ఘమైన క్లాసు తీసుకుంటుందావిడ. అందుకు సిద్ధంగానే ఉన్నాను.

సాయంకాలం అవుతోంది. బాల్కనీలో కూర్చుని కాఫీ తాగుతున్నాను. కాఫీని కొద్ది కొద్దిగా నోట్లోకి తీసుకుని ఆ వేడి, ఆ ఘుమఘుమ అనుభవిస్తూ తాగుతున్నాను.

ఇంతలో మావయ్యగారి దగ్గర నుండి ఫోను. పృథ్వికి



యాక్సిడెంట్ జరిగింది. ఫలానా హాస్పిటల్‌లో ఉన్నాం త్వరగా రమ్మని. పది నిముషాలలో హాస్పిటల్‌లో ఉన్నాను. మావయ్యగారు చాలా కంగారు పడుతున్నారు.

పృథ్వీ కారు చెట్టును గుద్దుకుందట. కాలు, చెయ్యి ఫ్రాక్చర్ అయ్యాయి. వళ్లంతా చిన్న చిన్న గాయాలు. ఒక్కటే హడావిడి చేస్తున్నాడు.

"ఇక నేను చూసుకుంటాను మావయ్య గారు..." భయపడవలసిన పనిలేదని అర్థ మయ్యాక ధీమాగా చెప్పాను.

ఆ రాత్రంతా పృథ్వీ మత్తులో ఉన్నాడు. అత్తయ్యగారికి ఫోన్ చేద్దా మంటే తుఫాన్ వల్ల నెట్ వర్క్ ప్రాబ్లమ్ వచ్చి సిగ్నల్ అందడం లేదు. తెల్లవారి మెలకువ వచ్చిన దగ్గర నుండి పృథ్విని పట్టుకో వడం కష్టమైపోయింది. టెంపరే చర్ కూడా తగిలింది.

"ఏమిటండి చిన్నపిల్లాడిలా మారాం చేస్తారు. ఇదిగో ఎఫ్.ఎమ్. రేడియో వినండి. హాయిగా నిద్ర పడుతుంది." చెప్పాను.

"ఆ ఫోన్ అవతల పారెయ్. లేదా నేనే బయటకు విసి రేస్తాను" అరిచాడు పృథ్వీ.

"పృథ్వీ! ఏం భయం లేదురా. చిన్న చిన్న దెబ్బలే త్వరగా నయమైపోతాయి" మావయ్యగారు ఊరడిం చారు.

"అమ్మను రమ్మని ఫోన్ చేశావా డాడీ?" అడిగాడు పృథ్వీ.

"వస్తుందిరా తుఫాన్ కదా? రావడం కొద్దిగా ఆలస్య మవుతుంది"

ఆ మాటలకు కోపంగా అటు ముఖం తిప్పుకున్నాడు పృథ్వీ. నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను. అస్సలు నెమ్మదించడే. డాక్టర్ వచ్చి ఇంజక్షన్ ఇచ్చి వెళ్లినా కాస్సేపు నిద్రపోయి మళ్లీ అమ్మ అంటూ ఒకటే గోల. దగ్గ రగా పడుకుని పట్టుకుంటే కాస్త ఉపశమనంగా ఉంటుం దేమోననిపించి మావయ్యగారు బయటకు వెళ్లినప్పుడు ట్రై చేశాను. కోపంగా కసిరిపొమ్మన్నాడు పృథ్వీ. నాకు నోట మాట రాలేదు. పెళ్లయ్యింది మొదలు నాపై కోపం తెచ్చుకున్నదే లేదు. మేమిద్దరం అర్ధనారీశ్వరుల్లాగా కలిసే తిరిగేవాళ్లం. ఒక్క క్షణం నన్ను వదిలేవాడు కాదు. అటువంటిది ఇప్పుడు చిన్న యాక్సిడెంట్ జరిగేసరికి అమ్మ కావల్సి వచ్చిందా?

"వెళ్లి అమ్మను తీసుకురండి" మళ్లీ అరిచాడు పృథ్వీ.

ఇక తప్పదని మావయ్యగారు బయలుదేరారు. ఇంతలో వరండా ఆ చివర నుండి మా అత్తగారు ఆఘమే ఘాల పై వస్తూ కనబడింది.

"అమ్మయ్య" అని నేను, మావయ్యగారు ఊపిరి పీల్చుకున్నాం.

అత్తయ్య రావడమే వాతావరణం మారిపో యింది. ఆవిడని చూస్తూనే పృథ్వీ బాధ సగం తీరి పోయింది. తడిగుడ్డతో ఒళ్లు తుడిచిందా విడ. గబగబా జ్యూస్ తీసి పృథ్వీతో తాగించింది. పృథ్వీ పక్కనే కూర్చుని ధైర్యం చెప్పసాగింది.

గ్రీకువీరుడిలా ఆరడుగుల పొడవు, ఎనభై కేజీల బరువుండే ఆ మగధీరుడు ఆవిడ ముందు మూడేళ్ల పసిపాప అయిపో యాడు.

నా కళ్లు తెరుచుకు న్నాయి. మగవాడి జీవి తంలో భార్య స్థానం తిరిగి భర్తీ చేయబడవచ్చు. కానీ అమ్మ స్థానం ఎప్పటికీ భర్తీ కాదు. అమ్మ అమ్మే. అమ్మ కావడం కంటే గొప్ప విషయం లేదు. నేను ఎక్కవలసిన మెట్లు ఏవో నాకు అర్థమయ్యాయి.

పృథ్వీ నిద్రపోయాక ఇటు తిరిగిన అత్త య్యగారికి నా కళ్లలో నా నిర్ణయం కనిపించింద నుకుంటా ఆనందంగా నవ్వారు. గభాలున వంగి ఆమె పాదాలు కళ్లకద్దుకున్నాను.

○